

సాగుకు ధోకా లేదు



నిండుకుండలా ఉన్న జూరాల ప్రాజెక్టు

- గతేడాది కరువు తీరేలా పుష్కలంగా కురిసిన వానలు
- మూడు రోజులపాటు వర్షాలతో నిండుకుండల్లా చెరువులు
- వరద రోజుల్లోనే వానాకాలం పంట చేతికి వచ్చే అవకాశం
- జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు, రిజర్వాయర్లు
- అన్ని జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతేడాది కరువుతో అల్లాడిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది సానుకూల వర్షపాతం నమోదైంది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీరు లేక గతేడాది ఒక సీజన్ క్రాప్ హాలిడే ప్రకటించారు. మరో సీజన్‌లో ఎండుతున్న పంటలను పశువులకు వదలడమో.. లేక తగలబెట్టడమో చేశారు. అయితే ఈ ఏడాది జూన్ ఆరంభం నుంచే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు ఆశాజనకంగా పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మెజారిటీ చెరువులు అలుగులు పారుతుండగా.. కొన్ని చెరువులు అలుగులు పారడానికి సిద్ధంగా ఉన్నాయి. మూడు నెలలుగా వరద వస్తుండటంతో ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టుకు నీరందించేకు సాధ్యమైనంత నీటిని ఎత్తిపోశారు. వాటి కింద ఉన్న రిజర్వాయర్లను నింపడంతోపాటు ఆన్‌లైన్‌లో ఉన్న చెరువులను కూడా నింపారు. ఇప్పుడు వర్షాలు కురవడంతో దాదాపు చెరువులన్నీ నిండగా, ఎత్తిపోతల పథకాలకు నీటిని బంద్ చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జూరాల, కోయిల్‌సాగర్, సరళాసాగర్, రామన్‌పాడు జలాశయాల గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు కూడా నిండుకుండలా ఉండటంతో దానిపై ఆధారపడిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు ధోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరద వస్తున్న రోజుల్లోనే వానాకాలం పంట చేతికి వచ్చే అవకాశం ఉండగా.. నిల్వ చేసుకున్న నీరు యాసంగి పంటల ఉపయోగపడనుంది. గతేడాది తాగునీటికి కూడా ఇబ్బందులు పడి నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేసుకోగా.. ఈ ఏడాది ఆ పరిస్థితులు ఏర్పడవని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 5,161 చెరువులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 5,161 చెరువులు, 1257 వరకు కుంటలు ఉన్నాయి. అందులో చాలావరకు కుంటలు కనుమరుగు కాగా.. కొన్ని చెరువులు అన్యాక్రాంతం అయ్యాయి. మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అందులో దాదాపు మూడు వేలకుపైగా చెరువులు అలుగులు పారుతున్నాయి. దాదాపు 1,500 చెరువులు అలుగులు పారడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి ఎత్తిపోతల పథకాలకు అనుసంధానంగా లేకపోతే ఉమ్మడి జిల్లాలో చెరువులు నిండటం గగనమవుతోంది. కానీ రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు, ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఎత్తిపోతలతో సంబంధం లేకుండానే చెరువులన్నీ అలుగులు దూకుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఎత్తిపోతల పథకాలను కృష్ణానదికి వరద ఉన్న 90 రోజులపాటు నడిపించుకోవాల్సి ఉండగా.. వాటికి ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్ ఛానల్స్ లేకపోవడంతో గొలుసుకట్టు చెరువులనే ఆదెరువుగా చేసుకున్నారు. ఇప్పుడు వర్షాలతో అవి నిండటం వల్ల ఎత్తిపోతల పథకాలు ఆగిపోయాయి. అలాగే ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన జూరాల గేట్లు ఇప్పటికే తెరవడంతో శ్రీశైలంవైపు నీటిని వదులుతున్నారు. సరళాసాగర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు నీరు తిరిగి కృష్ణానదిలో కలిసి పోతోంది. నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల్లోని ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు, సంగంబండ, భూత్పూరు, శంకరసముద్రం, రంగసముద్రం, ఎనుకుంట రిజర్వాయర్లు కూడా నిండిపోయాయి. నెట్టెంపాడుకు ఈ సీజన్‌లో 4.48 టీఎంసీలు, భీమా 1కు 2.71, భీమా-2కు 3.13, కోయిల్‌సాగర్‌కు 1.77 టీఎంసీలను ఎత్తిపోశారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు ఇప్పటివరకు 10 టీఎంసీల వరకు ఎత్తిపోశారు.



అలుగు పారుతున్న అడ్డాకుల మండలం శాఖాపూర్ చెరువు



అలుగు పారుతున్న వనపర్తి నల్ల చెరువు

జిల్లాల వారీగా ఈ ఏడాది ఇప్పటి వరకు కురవాల్సిన, కురిసిన వర్షపాతం వివరాలు(మి.మీ.లో)

జిల్లా	కురవాల్సింది	కురిసింది
వనపర్తి	367.4	793.9
జోగుళాంబ గద్వాల	326.9	637.3
నాగర్‌కర్నూల్	342.5	464.6
నారాయణపేట	333.8	563
మహబూబ్‌నగర్	360.4	590

అత్యధిక వర్షపాతం నమోదు..

స్థానిక ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులను ఏళ్లుగా కృష్ణానది ఆధారంగా నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారానే నింపుతున్నారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు కురిస్తే ఇక్కడకు వరద వస్తుండటంతో ఆయకట్టును సాగు చేస్తున్నారు. ఎగువన సరైన వర్షపాతం లేకపోతే ఇక్కడ క్రాప్‌హాలిడే ప్రకటించుకోవడంతో పాటు, తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. కానీ ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండాయి. గతేడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు కాగా. ఈ ఏడాది ఇప్పటికే సంవత్సరంలో కురవాల్సిన వర్షం కంటే ఎక్కువ కురిసింది. ఇంకా నవంబరు వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతాంగానికి ఇబ్బందులు ఉండవు. గతేడాది అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

వైద్యులు లేని ధర్మాస్పత్రి

- మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ల కొరత
- కాలపరిమితి ముగియడంతో వెళ్లిపోయిన 23 మంది సీనియర్ రెసిడెంట్‌లు
- 24 మందికి నోటిఫికేషన్ వేయగా వచ్చింది ఇద్దరే
- అస్తవ్యస్తంగా మారిన రేడియాలజీ విభాగం
- రోగులకు తప్పని ఇక్కట్లు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 4: మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రిలోని ఐదు విభాగాల్లో సీనియర్ డాక్టర్లకు సహాయకులుగా ఉంటూ, రోగులకు సేవలందిస్తున్న 24 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల కాలపరిమితి ముగియడంతో వారు కూడా వెళ్లిపోయారు. దాంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కొత్తగా 24 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ వేయగా, ఒకరిద్దరు మాత్రమే వచ్చారు. రేడియాలజీ విభాగంలో రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.



అల్ట్రాసౌండ్ స్కానింగ్ విభాగం వద్ద బారులు తీరిన రోగులు

పూర్తయిన కాలపరిమితి

ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, పిడియాట్రిక్, రేడియాలజీ విభాగాలు ఉన్నాయి. వాటిలో జనరల్ మెడిసిన్ విభాగంలో ఆరు గురు, జనరల్ సర్జరీలో ఐదుగురు, గైనిక్‌లో ఐదుగురు, పిడియాట్రిక్‌లో నలుగురు, రేడియాలజీ విభాగంలో ముగ్గురు చొప్పున మొత్తం 23 మంది ఉన్నారు. వీరిని అసోసియేట్, అసిస్టెంట్ డాక్టర్లకు సహాయకులుగా ఏడాది వరకు నియామకాలు చేసుకుంటారు. తిరిగి ప్రభుత్వం నుంచి ఆర్డరు వస్తే వారిని తొలగించాలని వారికిచ్చే నియామక ఉత్తర్వుల్లోనే ఉంటుంది. దీని ప్రకారం వీరి కాలపరిమితి గత నెల ఆగస్టు ఒకటి నాటికి పూర్తికావడంతో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆసక్తి చూపని వైద్యులు

వారం కిందట ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కొత్తగా అసిస్టెంట్ డాక్టర్ల నియామకాల కోసం నోటిఫికేషన్ వేశారు. అందులో జనరల్ మెడిసిన్ నుంచి 10 మంది, గైనిక్ నుంచి 10, రేడియాలజీ నుంచి నలుగురు, పిడియాట్రిక్ నుంచి తొమ్మిది, జనరల్ సర్జరీ నుంచి ఒక పోస్టుకు నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ కొత్తవాళ్లు పోస్టింగ్ తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. గైనిక్ విభాగంలో 10 మంది అసిస్టెంట్లకుగాను ముగ్గురు ఆర్డర్ తీసుకున్నారు. అందులో ఇది వరకు ఎస్‌ఆర్‌గా పని చేసిన డాక్టర్ ఒకరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తీసుకున్నారు. మిగతా ఇద్దరు ఇంకా రాలేదు. జనరల్ మెడిసిన్‌లో 10 మందికిగాను ఒక్కరే వచ్చారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు లేకపోవడం కొంత ఇబ్బందిగానే ఉంది. అయినప్పటికీ రోగులకు అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల కోసం నోటిఫికేషన్ వేశారు. ఇంటర్వ్యూలు కూడా జరిగాయి. అందులో కొంతమంది వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఎవరైనా డాక్టర్లు ఉంటే వారిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ సంపత్‌కుమార్, సూపరింటెండెంట్

రేడియాలజీ విభాగంలో ఇద్దరే..

రేడియాలజీ విభాగంలో ముగ్గురు ఎస్‌ఆర్‌లు వెళ్లిపోవడంతో కేవలం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. ఈ రెండు విభాగాలలో ప్రతీ రోజు దాదాపు 200 నుంచి 250 మంది వరకు వస్తుంటారు. కానీ ఇద్దరే ఉండటంతో పని ఒత్తిడి తీవ్రంగా పెరిగి, మానసిక ఇబ్బందులు పడుతున్నారు.

రోగులకు తప్పని ఇక్కట్లు

ఆస్పత్రిలోని ఐదు విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు వెళ్లిపోవడం, కొత్త వారు రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా గైనిక్ విభాగంలో ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి సాయంత్రం మూడు గంటలకు ఓపీ కోసం వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇందులో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్, ముగ్గురు అసిస్టెంట్ డాక్టర్లు మాత్రమే ఉన్నారు. వారు పని ఒత్తిడికి లోనవుతున్నారు. అయినా రోజూ 500 నుంచి 600 మందికి ఓపీ, చూడటంతో పాటు 30 నుంచి 50 వరకు ప్రసవాలు చేస్తున్నారు.

జోరందుకున్న కొనుగోళ్లు

- మండపాలకు చేరుతున్న గణనాథులు
- వివిధ రంగుల్లో ఆకట్టుకుంటున్న విగ్రహాలు
- పాలమూరులో 15 అడుగుల ఎత్తున్న విగ్రహాలు అందుబాటులో
- రూ.వేలల్లో ధరలు.. కొనేందుకు నిర్వాహకుల పోటీ



మహబూబ్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో విగ్రహాలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 4: మరో రెండ్రోజుల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో విగ్రహాల కొనుగోళ్లు జోరందుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి ఉత్సవ సమితి, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు జిల్లా కేంద్రంలోని వినాయక విగ్రహ తయారీ కేంద్రాలకు వచ్చి, వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. అడ్వాన్స్‌లు చెల్లించి, బుక్ చేసుకుంటున్నారు. రెండ్రోజులుగా పట్టణంలోని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద జనసందడి నెలకొంది. పట్టణంలో పెద్ద ఎత్తున విగ్రహాల తయారీ కేంద్రాలు వెలిశాయి. కొందరు మట్టి గణపతులను తయారు చేస్తే, మరికొందరు ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేస్తున్నారు. రంగురంగుల గణనాథుల విగ్రహాలు ఆకర్శిస్తున్నాయి. ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. పాలమూరులో నాలుగు నుంచి 15 అడుగుల ఎత్తున్న విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి.

ధరలు ఇలా..

ఆరు నుంచి ఏడు అడుగుల ఎత్తున్న విగ్రహాల ధరలు రూ. 15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉన్నాయి. ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తున్నవి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను కూడా విక్రయిస్తున్నారు. వాటిని కొనేందుకూ చాలామంది ఆసక్తి చూపుతున్నారు. గురు, శుక్రవారాల్లో విగ్రహాలను అధికంగా కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే పలువురు విగ్రహాలను కొనుగోలు చేసి, తీసుకెళ్తున్నారు. మండపాలను ముస్తాబు చేస్తున్నారు. పది రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా కొనసాగున్నాయి. జిల్లాలోని అన్ని చెరువులు నిండటంతో వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు తీరాయి.



మల్లికార్జున చౌరస్తాలో విక్రయానికి ఉంచిన మట్టి విగ్రహాలు



ట్రాక్టర్‌లో మండపానికి తరలిస్తున్న విగ్రహం



వెంకటేశ్వర, పద్మావతి కాలనీల్లో వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న విగ్రహాలు



భారీ విగ్రహాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి



భానుమూర్తి, నిహాన్స్ (ఫైల్)


కోస్గి రూరల్, సెప్టెంబరు 4 : నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా గుండుమల్ మండల పరిధిలోని బుధవారం చోటుచేసుకున్నది. బలభద్రాయపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన పుల్లని నర్సింహులు, కవిత దంపతులకు భానుమూర్తి (2), నిహాన్స్ (3) ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం సాయంత్రం ఇరువురు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న నీటి గుంతలో పడిపోయారు. ఎవరూ గమనించకపోవడంతో ముక్కుపచ్చలారని ఆ ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఇంటి పక్కన నివసించే వారు గమనించడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. మృతదేహాలను చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చెరువులో పడి వ్యక్తి..

దేవరకద్ర, సెప్టెంబరు 4 : కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి మూర్ఛవ్యాధితో చెరువులో పడి మృతి చెందిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో చోటుచేసుకున్నది. వెంకటాయపల్లి గ్రామానికి చెందిన చరణ్ (30) బుధవారం ఉదయం కాలకృత్యాలను తీర్చుకోవడానికి ఇంటి నుంచి గ్రామ సమీపంలోని చెరువు దగ్గరికి వెళ్లాడు. మూర్ఛరావడంతో చెరువులో పడి మృతి చెందాడు. ఇది గమనించిన కొందరు రైతులు చరణ్‌ను వెలికితీసి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కొత్తకోట, సెప్టెంబరు 4: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండల కడుకుంట్లకు చెందిన శ్రీనివాసులు (28) బైక్‌పై కొత్తకోట నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. రహదారిపై మరమ్మతుల కోసం నిలిచిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులో ఉన్న ఆధారాలతో బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ఆకట్టుకుంటున్న జలపాతం

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్, పదర మండలాల సరిహద్దులో గల గుండం జలపాతం ఆకర్శిస్తోన్నది. ప్రసుత్తం వర్షాలు పడటంతో పైనుంచి నీళ్లు జాలువారుతున్నాయి. జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు తరలొస్తున్నారు. జంగంరెడ్డి పల్లి గ్రామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఈ జలపాతం వద్దకు రావడానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో రోడ్డును ఏర్పాటు చేశారు.

- అమ్రాబాద్

రోడ్డు ప్రమాదంలో.. యువకుడికి గాయాలు

మాగనూరు, సెప్టెంబరు 4: మండలంలోని వడ్వాట్ చెందిన గుంటగారి వెంకటేష్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన ప్రకారం వడ్వాట్ నుంచి వెంకటేష్ బైక్‌పై మక్తల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివాలయం వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తెలకపల్లి, సెప్టెంబరు 4 : మండల కేంద్రం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. బుధవారం మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం బైక్‌పై వస్తున్న ఇద్దరు, మరో బైక్‌పై వస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. బల్మూరు మండలం పోలేపల్లికి చెందిన తిరుపతయ్యకు కాలు విరగగా, మరో బైక్‌పై ఉన్న ప్రవీణ్, సాయికృష్ణకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పంటలను రక్షించుకోండి

పాలమూరు, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన అధికవర్షానికి పంటలను రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ రైతులకు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. వరి, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు పంటలు అధిక నీటిని లేవని, లోతైన కాల్వల ద్వారా నీటిని బయటకు పంపి పంటలను కాపాడుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారుల నుంచి సలహాలు తీసుకుని పంటలను కాపాడుకుని అధికదిగుబడిని సాధించాలని పేర్కొన్నారు.

అధిక వర్షాలు ఆయిల్‌పాం తోటలకు మంచివే..

పాలమూరు, సెప్టెంబరు 4: ఎడతెరిపిలేని వర్షాలు ఆయిల్‌పాం తోటలకు మంచివే కాని.. జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి వేణుగోపాల్ బుధవారం ప్రకటనలో రైతులకు సూచించారు. అధికవర్షంతో ఆయిల్‌పాం తోటల్లో అక్కడక్కడా నీరు నిల్వటం, తీవ్రమైన గాలులకు మొక్కలు ఒరిగిపోవటం జరిగినా.. లోతట్టు ప్రాంతాలలో వేసిన తోటల్లో, ఒంగిపోయిన తోటల్లోనూ ఉద్యాన అధికారుల సూచనలు పాటించి తోటను కాపాడుకోవాలని తెలిపారు. ముదురు తోటలలో తీవ్రమైన గాలులకు అక్కడక్కడా మువ్వ వంగిన మొక్కలలో వంగిన ప్రాంతంలోని ఆకులను కత్తిరించి కార్బండాజిమ్‌ను నీటితో కలిసి మొవ్వుభాగాన్ని తడపాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఊర్కొండ, సెప్టెంబరు 4: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అందజేశారు. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊర్కొండపేట పరిధిలోని ఠాకూర్ తండాకు చెందిన రమావత్ మోతిలాల్ ఫిబ్రవరి నెలలో ఫోన్ పోగొట్టుకున్నాడని ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొబైల్‌ని గుర్తించామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం - కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబరు 4 : జడ్చర్ల పట్టణానికి చెందిన విద్యార్థి జశ్వంత్ మహబూబ్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 3న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో బుధవారం తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా రథోత్సవం

నారాయణపేట రూరల్, సెప్టెంబరు 4 : మండల పరిధిలోని కోటకొండ నర్సాచల వేంకటేశ్వర స్వామి ఆలయంలో 81వ రఘుప్రేమ తీర్థుల మధ్య ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రతేక పూజా కార్యక్రమాలతో పాటు పుష్పాలంకరణ, పల్లకీ సేవ, మహారథోత్సవం కనుల పండువగా కొనసాగింది. విద్వాన్‌లు మక్తల్ రాఘవేంద్ర, జయతీర్థ ఆచార్యులు రఘుప్రేమ తీర్థుల మహిమలను కొనియాడారు. కార్యక్రమంలో నర్సాచల శ్రీనివాస సేవా సమితి సభ్యులు జనార్ధన్ రావు, సీతారామారావు, పద్మనాభ, ప్రభంజన్‌రావు, శ్రీనివాస్, శ్రీపాద్, హన్మేష, భీంసేన్, రాము, మధు, నారాయణ, భరత్, న్యాయవాదులు నందు నామాజీ, సతీష్ గౌడ్ పాల్గొన్నారు.


మహా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీలో రెండో స్థానం



బహుమతులు అందుకున్న రాష్ట్ర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4: బీహార్ రాష్ట్రంలో 2వ తేదీ నుంచి 4వరకు నిర్వహించి న జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ గో-గేమ్ టోర్నీలో రాష్ట్ర జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్ర జట్టు రెండో స్థానంలో, సీనియర్స్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. టోర్నీలో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటడంపై అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్‌షకీల్ అహ్మద్ క్రీడాకారులను బుధవారం అభినందించారు.

కేఎల్ఐ కాల్వకు మరమ్మతు చేపట్టాలి

కల్వకుర్తి, సెప్టెంబరు 4: భారీ వర్షాలకు పలు చోట్ల కేఎల్ఐ కాల్వ దెబ్బతింది. కల్వకుర్తి మండలం తిమ్మరాశిపల్లి, వెంకటాపూర్ సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండ్లు పడ్డాయి. దీంతో నిరంతరం నీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి తెగిపోయిన కాల్వలను వెంటనే మరమ్మతులు చేయాలని రైతు సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పసుల గోవర్ధన్‌రెడ్డి, రైతులు కోరారు.

తల్పునూరులో బోనాల ఊరేగింపు

రేవల్లి, సెప్టెంబరు 4 : మండలంలోని తల్పునూర్‌లో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కొత్త కుండలో నైవేద్యం వండి, అలంకరించి, డప్పు చప్పులతో పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేశారు. అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ పండుగను పుబ్బకార్తిలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం కోళ్లు, మేకలను బలి ఇచ్చారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

లారీని ఢీకొన్న బొలెరో వాహనం
- డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన బొలెరో వాహనం

బాలానగర్, సెప్టెంబరు 4: లారీని ఢీకొని బొలెరో వాహన డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ప్యాపిలి మండలం పొతిరెడ్డి చెందిన శివయ్య (32) బొలెరో వాహనంలో టమాటాల లోడ్ హైదరాబాద్ బయలుదేరాడు. బాలానగర్ మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ముందు వెళ్తున్న లారీని శివయ్య బలంగా ఢీకొట్టాడు. దీంతో శివయ్య వాహనంలోనే తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని బయటకు తీశారు. 108 సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి కిందపడడంతో యువకుడికి తీవ్ర గాయాలు

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 4: బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పెబ్బేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న రాజేష్ తన పనులు ముగిశాక బైక్‌పై సొంత గ్రామం శ్రీరంగాపురం బయలుదేరాడు. పెబ్బేరు-కంచిరావుపల్లి సమీపాన బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆయనను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో అంబులెన్స్ ద్వారా హైదరాబాద్ తీసుకెళ్లారు.

కొత్తకోటలో డెంగీ కేసు నమోదు



బాలుడి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

కొత్తకోట, సెప్టెంబరు 4: పట్టణంలోని ఆరవ వార్డు జయప్రకాష్‌నగర్ కాలనీలో డెంగీ కేసు నమోదైంది. కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడు మహేందర్ జ్వరంతో బాధపడతుండగా తల్లిదండ్రులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. రక్త పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. బాలుడికి ప్రత్యేక చికిత్స చేపట్టినట్లు డాక్టర్ ఆసియాబేగం తెలిపారు. అలాగే వారి ఇంటికి మునిసిపల్ సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది వెళ్లి పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జ్వరం వచ్చిన వారు రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని కాలనీ వాసులను కోరారు.

రెండు వడ్ల లారీలు పట్టివేత



పోలీసుల అదుపులో వడ్ల లారీ

కొత్తకోట, సెప్టెంబరు 4: వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నాటవెల్లి-పామాపురం మధ్యలో ఇతర ప్రాంతానికి వడ్లతో వెళ్తున్న రెండు లారీలను జిల్లా సీసీఎస్ పోలీసులు బుధవారం పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. వడ్ల లారీలపై సివిల్ సప్లయి అధికారులతో కలిసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వడ్లు సీఎంఆర్‌కు చెందినవా? కాదా? అనే దానిపై సివిల్ సప్లయి అధికారులు ధ్రువీకరించాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు.


వైద్య సిబ్బంది కోసం నిరీక్షణ



వైద్య సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న చిన్నారుల తల్లులు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 4: వైద్యుల కోసం రోగుల నిరీక్షణ తప్పడం లేదు. ఎప్పుడు వస్తారో.. వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితి జిల్లా కేంద్రంలోని పీపీ యూనిట్‌లో బుధవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పీపీ యూనిట్ ప్రతి మంగళ, బుధవారాల్లో చిన్న పిల్లలకు వ్యాక్సిన్ ఇస్తారు. ఈ మధ్యకాలంలో తరచుగా వైద్య సిబ్బంది సమయపాటన పాటించకపోవడంతో చిన్న పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు, బంధువులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఈ కేంద్రానికి అన్ని విభాగాల వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పీపీ యూనిట్ డాక్టర్ సంతోష్ అభిరామ్‌ను వివరణ కోరగా.. ఈ మధ్య కాలంలో పీపీ యూనిట్‌లో పని చేస్తున్న వైద్య సిబ్బందికి బదిలీపై వెళ్లడంతో కొత్త సిబ్బంది వచ్చారని తెలిపారు. దీంతో విధుల్లో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

మద్దిగట్లలో ఘనంగా శ్రీకృష్ణశోభాయాత్ర



పల్లకీ సేవలో ఎమ్మెల్యేలు జీఎంఆర్, రాజేష్‌రెడ్డి

భూత్పూర్, సెప్టెంబరు 4: భక్తి మార్గానికి మించిన ఆనందం మరోకటి ఉండదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని మద్ధిగట్ల, వెల్కిచర్ల త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మద్ధిగట్ల, వెల్కిచర్లలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి శోభాయాత్ర కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి దంపతులు, నాగకర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి వద్ద శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పల్లకీసేవ, అఖండ భజన, కోలాట భజనలు, గిరిజన మహిళల నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని ఏటా శ్రీనివాస్‌రెడి నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మొదలైన శోభాయాత్ర సాయంత్రం 5గంటల వరకు రెండు గ్రామాల్లో కొనసాగింది.

భారీ వర్షాలకు అతలాకుతలం

- పంట నీటమునగడంతో రైతుల ఆందోళన
- పత్తి, మిరప, కంది పంటలకు తీవ్ర నష్టం
- దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లు .. కూలిన ఇళ్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర నష్టం నెలకొంది. పొలాల్లో వరద నీరు చేరడంతో అవి చేతికందే పరిస్థితి లేదు. అదేవిధంగా వాగులు పొంగిపొర్లడంతో రోడ్లపై నీరు చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. అధిక వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయి. అదేవిధంగా శిథిలావస్థకు చేరిన, మట్టి మిద్దెల ఇళ్లు వర్షానికి తడిసి కూలిపోయాయి.



తాడూరు: దుందుభీనదిలో దెబ్బతిన్న కాజ్‌వే

తాడూరు, సెప్టెంబరు 4: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలు దెబ్బతిన్నాయి. నేలలో అధిక తేమశాతం ఉండడం మూలంగా పూత, పిందెలు, బుడలు పూర్తిగా ఎరుపు రంగులోకి మారి రాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 15రోజుల క్రితం వరకు పత్తి పంటలను చూసి సంబరపడి ఈ ఏడాది ఎకరాకు దాదాపుగా 15క్వింటాళ్ల మేర దిగుబడి సాధించే అవకాశాలు మెండుగా కనబడ్డాయి. కురిసిన అధిక వర్షాలతో పత్తి పంట రూపురేఖలు మారిపోయాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాడూరు మండల వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు.ఎకరాకు 5క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదంటూ చెబుతున్నారు.

గుంతలమయమైన కాజ్‌వే

వరదలకు సిర్సవాడ వద్ద దుందుభి నదిపై ఉన్న కాజ్‌వే మొత్తం గుంతలమయంగా మారిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు లేచి పక్కకు పడిపోవడంతో నడవరాని పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి కోతకు గురైన రహదారులను మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు, పొంగిన వాగులు

ఇటిక్యాల: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో పంటలు నీట మునిగిపోగా రహదారులు దెబ్బతిన్నాయి. ఇటిక్యాల, సాతర్ల, చాగాపురం పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో కంది, మిరప, పత్తి నీట మునిగాయి. ఉదండాపురం, ఇటిక్యాల, సాతర్ల మధ్య ఉన్న వాగులకు వరద రావడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఇటిక్యాల, వేముల మధ్య ఉన్న రైల్వే అండర్ గ్రౌండ్ వంతెన నీటితో నిండిపోయింది. ఇటిక్యాల రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన పనుల వద్ద మట్టి కొట్టుకుపోయి మోకాలు లోతు నీరు చేరాయి. ఇటిక్యాల మండలం సాతర్లలో మంగళవారం రాత్రి మెకానిక్ ఖాజా కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా, మట్టి గోడ పడిపోయింది. వారు అప్రమత్తమై బయటకు రావడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

మంత్రాలయం వెళ్లే దారి మళ్లింపు



అయిజ: భారీ వర్షాల కారణంగా 15 రోజుల క్రితం వరద నీటితో వాగులు, వంకలు ఏకమై ప్రవహించాయి. తిరిగి మంగళవారం సాయంత్రం, రాత్రి వర్షం కురిసింది. ఎగువ నుంచి భారీగా వరద రావడంతో అయిజ సమీపంలో మంత్రాలయ రహదారిలో గల వాగుపై ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో మంత్రాలయం, ఎమ్మిగనూర్ వెళ్లే ప్రయాణికులు ఉత్తనూర్, తుపతురాల, మేడికొండ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అయిజ పాత, కొత్త బస్టాండ్ మధ్యన ఉన్న చిన్న వంతెనపై నుంచి పెద్దవాగు పొంగి పొర్లింది. అయిజ సమీపంలోని కర్నూల్ రహదారి వంతెనపై నుంచి సైతం వరద రావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోయాయి. బుధవారం సాయంత్రం సైతం వర్షం కురిసింది.

వాగులు దాటుతూ..

వడ్డేపల్లి, సెప్టెంబరు 3: వడ్డేపల్లి మండలంలోని పైపాడులో కొద్దిపాటి వర్షం కురిసినా ఎగువ నుంచి వచ్చే వరద, కాల్వ నీరు ఏకమై పెద్దఎత్తున చేరడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. పాత రాజోళి నుంచి వడ్డేపల్లి, పైపాడు మీదుగా ఆముదాలపాడు, నారాయణపూరం జాతీయ రహదారికి, రైల్వేస్టేషన్‌కు ఈ నక్ష మార్గం ద్వారా వెళ్లేవారమని అక్కడి రైతులు, ప్రజలు తెలిపారు. కొద్దిపాటి వర్షం కురిసినా వాగు ఉధృతి ఎక్కువై పూర్తిగా నీటితో నిండిపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతంలో రైతులు ధాన్యాన్ని తీసుకెళ్తుండగా వరద ఉధృతిని తప్పించుకుని వాగులో ఎద్దుల బండితో సహా ధాన్యం కొట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయి.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ఎర్రవల్లి, సెప్టెంబర్ 4: ఏళ్ల గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని గ్రామాల వాగులపై వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు పూర్తి చేయకుండా జాప్యం చేయడంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శేకుపల్లి పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు రూ. 3కోట్ల అంచనా వ్యయంతో మంజూరయ్యాయి. పనులలో జాప్యం కారణంగా డైవర్షన్ రోడ్డు సైతం ఆదివారం కోతకు గురైందని, సరిగా వేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులు దాదాపు ఐదు గ్రామాల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఈ వాగు పరిస్థితిని కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. రాజశ్రీ గార్లపాడు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ. 2.20కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణం కాకపోవడం ఐదు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. వల్లూరు వాగుపై బ్రిడ్జి చాలా అవసరం. వాగు ఉప్పొంగి గ్రామంలోకి నీరు చేరడమే కాక పొలాల్లోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండటంతో 10 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచాయి.



వర్షాల కారణంగా ఇటిక్యాల వద్ద దెబ్బతిన్న రోడ్డు



ఎర్రవల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న వల్లూరు వాగు



వడ్డేపల్లి: ఎద్దుల బండిపై రోడ్డు దాటుతున్న గ్రామస్థులు



ఇటిక్యాల: సాతర్లలో నీట మునిగిన మిరపపంట

కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

కొత్తకోట, సెప్టెంబరు 4: వనపర్తి జిల్లా కొత్తకోటలో బందెమ్మ కుమారుడు మహేష్‌తో కలిసి ఇంట్లో ఉంటున్నారు. వారు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గోడ కూలింది. కట్టెలు మీద పడడంతో కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చి బందెమ్మ, మహేష్‌లపై పడిన కట్టెలు, మట్టిని తొలగించారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్లు రాములు యాదవ్, ఖాజామైనోద్దీన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు. వారిద్దని తాత్కాలికంగా షాదీఖానాలో ఆశ్రయం కల్పించారు.

మానవపాడులో కూలిన మట్టి మిద్దె



మానవపాడు: జల్లాపురంలో వర్షానికి కూలిన మట్టిమిద్దె

మానవపాడు, సెప్టెంబరు 4: మండలంలోని జల్లా పురం మాలవీధిలో మట్టి మిద్దె బుధవారం అర్ధరాత్రి కూలిపోయింది. వివరాల్లోకి వెళితే మాలవీధికి చెందిన లక్ష్మీదేవి, తిమ్మన్న, కుమారుడు శేఖర్, కోడలు ప్రశాంతి రాత్రి నిద్రిస్తున్న సమయంలో మిద్దె ఒక్కసారిగా కూలింది. దీంతో కుమారుడు శేఖర్, కోడలు ప్రశాంతికి గాయాలయ్యాయి. దీంతో నిత్యావసర సరుకులు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశరు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ గురురాజా జల్లాపురంలో బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలను సేకరించారు. మండలంలో ఇప్పటి వరకు 9మట్టి మిద్దెలు కూలినట్లు ఆర్‌ఐ తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వకు గండి



కాల్వ నుంచి వృథాగా వెళ్తున్న నీరు

వెల్దండ, సెప్టెంబరు 4: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలకేంద్రం సమీపంలో లక్ష్మాపురం వద్ద బుధవారం కేఎల్‌ఐ కాల్వకు గండిపడింది. దీంతో సమీపంలోని సుమారు ఐదు ఎకరాల వరిచేను నీట మునిగింది. కాల్వకు ఏటా ఇదే ప్రాంతంలో గండిపడుతుందని రైతులు చెబుతున్నారు. నీటి వరద తగ్గిన అనంతరం మరమ్మతు చేపడతామని ఇరిగేషన్ డీఈ దేవన్న తెలిపారు. కొందరు రైతులు అ కారణంగా కాల్వకు గండి పెట్టినట్లు డీఈ తెలిపారు. వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు.

ప్రమాణం లేకుండానే 'మార్కెట్' బాధ్యతలు

- వివాదాస్పదంగా మారిన గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ
- కోర్టుకెక్కిన కాంగ్రెస్ కార్యకర్త



బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, సెప్టెంబరు 4: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం ఆది నుంచి వివాదాస్పదంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తమ వర్గీయులకే కేటాయించాలని పట్టుబట్టారు. ఈ అయోమయం నడుమ చివరకు ఎమ్మెల్యే వర్గీయులు మార్కెట్ కమిటీ చేజిక్కించుకున్నారు. దీంతో చైర్మన్‌గా నియమించబడిన కుర్వ హనుమంతు బుధవారం కార్యాలయంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, మార్కెట్ కార్యదర్శి నర్సింహులుతో బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా పాలకవర్గం లేకుండా ఖాళీగా ఉన్న మార్కెట్ కమిటీని ప్రభుత్వం గత నెల 31వ తేదీన చైర్మన్‌తో పాటు 18మందిని సభ్యులుగా నియమించింది. వీరు త్వరలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరిస్తారని అందరూ భావించారు. కానీ బుధవారం హడావిడిగా కొంత మంది నాయకులతో కార్యాలయానికి చేరుకున్న చైర్మన్ హనుమంతు అధికారులతో మాట్లాడి బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చైర్మన్ ఎంపికలో గందరగోళం

గద్వాల మార్కెట్ కమిటీ నియామక విషయంలో గందరగోళం ఏర్పడింది. మొదట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత 14మందితో కూడిన జాబితాను ప్రభుత్వానికి పంపించారు. దీన్ని జిల్లా ఇంచార్జ్ మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి ఆమోదించారు. ఆ తర్వాత పరిశీలనకు గద్వాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి రాగా వారు ఆమోదించారు. కానీ అంతలోనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 18మందితో కూడిన జాబితాను అందించారు. దీనికి కూడా మంత్రుల ఆమోదంతో పాటు గద్వాల వ్యవసాయశాఖ పరిశీలన తర్వాత ఎమ్మెల్యే పంపిన జాబితా ప్రకారమే జీఓ విడుదలైంది. దీంతో సరిత వర్గం అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

బాధ్యతల స్వీకరణ మాత్రమే

చైర్మన్ బాధ్యతలు మాత్రమే స్వీకరించారు. ప్రమాణ స్వీకారం చేయలేదు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి వారి పేర్లతో జీఓ వచ్చింది. ఆ కాపీ కార్యాలయానికి చేరింది. అందుకే బాధ్యతలు స్వీకరిస్తామంటే చైర్మన్‌కు అప్పగించాం. కోర్టు నుంచి మాకు ఎలాంటి నోటీసులు అందలేదు.

- పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్ అధికారి, గద్వాల

కోర్టుకు వెళ్లినందుకే..

ఎమ్మెల్యే పంపిన జాబితాకు అంగీకారంతో పాటు జీఓ జారీ కావడంతో సరిత వర్గంలో మార్కెట్ నామినేటెడ్ పదవులు ఆశించిన వారిలో అసంతృప్తి నెలకొంది. గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త లక్ష్మణ్ తనకు అన్యాయం జరిగిందని, మొదట తన పదవికి మంత్రులు అంగీకరించి ఆ తర్వాత వచ్చిన జాబితాలో తనపేరు లేకుండా చేశారని రిజర్వేషన్లు పాటించలేదని మంగళవారం కోర్టుకెక్కాడు. ఆ వెంటనే ప్రతివాదులకు నోటీసులు జారీ అయినట్లు సమాచారం. నోటీసులు కార్యాలయంకు చేరక ముందే బాధ్యతలు స్వీకరించాలనే ఉద్దేశంతోనే ప్రమాణ స్వీకారం లేకుండానే హడావిడిగా బాధ్యతలు స్వీకరించారనే ఆరోపణలు వస్తున్నాయి.

నాకు తీవ్ర అన్యాయం



జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పంపిన జాబితాలో నాపేరు ఉంది. దీనికి మంత్రుల ఆమోదం తెలిపారు. తర్వాత వచ్చిన జాబితాలో నా పేరులేదు. నేను దళితుడిని, సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తను అయిన నాకు అన్యాయం చేశారు. అందుకే నేనే స్వయంగా కోర్టుకు వెళ్లాను. కోర్టు న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది.

- లక్ష్మన్, ప్రతిపాదిత డైరెక్టర్

మంచిరోజు ఉన్నందుకే ..



మంచిరోజు ఉన్నందుకే బుధవారం ప్రమాణ స్వీకారంతో పాటు బాధ్యతలు స్వీకరించాను. ఎమ్మెల్యే సహకారంతో మార్కెట్ అభివృద్ధి చేస్తాను. రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు అన్ని సౌకర్యాలను కల్పిస్తాం.

- కుర్వ హనుమంతు, చైర్మన్

రాష్ట్రస్థాయి అవార్డులకు ఉపాధ్యాయుల ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ పాలమూరు యూనివర్సిటీ/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా/నాగర్‌కర్నూల్ టౌన్/ నారాయణపేట, సెప్టెంబరు 4: డాక్టర్ సర్వేప ల్లిరాధకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు హైదారాబాద్‌లో ప్రభుత్వం అందజేయనుంది. అవార్డులకు జిల్లా నుంచి పలువురు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలోని పీఎస్ ఇబ్రహీంనగర్ పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కె.నర్సింహులు, దేవరకద్ర మండలంలోని పెద్దరాజమూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత ఎంపికయ్యారు. పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌కి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. యూనివర్సిటీలో 2008 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎన్నో పరిశోధలు చేశారు. వనపర్తి జిల్లా యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్చం పలుస శంకర్ గౌడ్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. శంకర్ గౌడ్ పని చేసిన ప్రతి పాఠశాలలో అక్షరదీక్ష, విలువల విద్య, బాల సాహిత్య సభలు నిర్వహించేవారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి మండలం చిన్నముద్దునూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడు పని జె.రాజశేఖర్‌రావు, కల్వకుర్తి మండలం జీడిపల్లితండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.రఘురామారావు అవార్డుకు ఎంపికైనట్లు డీఈవో గోవిందరాజులు తెలిపారు. నారాయణపేట మండలంలోని కోటకొండ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సునీత అవార్డుకు ఎంపికయ్యారు.

ఫర్టిలైజర్ దుకాణంలో హార్డ్‌డిస్క్ చోరీ

తెలకపల్లి, సెప్టెంబరు 4 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని చోరీ జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శతాషి ఫర్టిలైజర్స్ షాపులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. యాజమాని కొత్తపల్లి మధుకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్వేలో వివరాలు వెల్లడించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల, సెప్టెంబరు 4: ఇంటి, ఇంటి సర్వేలో ఓటర్లు తమ పూర్తి వివరాలను వెల్లడించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌వో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి, ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను, ఓటరు జాబితాలో ఉన్న వివరాలను సరిచూడాలన్నారు. ఆధార్‌నెంబరు, మొబైల్‌నెంబరు ఇవ్వాలని, ఫొటో మార్చాల్సి ఉంటే కొత్త ఫొటో ఇవ్వాలని ఓటర్లకు సూచించారు. ఒకే పోలింగ్‌బూత్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లుండేలా చూడాలని, ఇళ్లు మారిన వాళ్లు తమ అడ్రస్ వివరాలను నమోదు చేయించాలని తెలిపారు. ఇంటినెంబరు తప్పుగా ఉంటే అక్కడే సరి చేస్తారని, సర్వేలో ఓటర్లు బీఎల్‌వో అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు మహబూబ్‌అలీ, రాజీవ్‌రెడ్డి, రాజకీయపార్టీల నాయకులు శ్రీకాంత్, నాగరాజు, బీఎల్‌వో అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్‌చౌరస్తా- క్లాక్‌టవర్ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 4: పట్టణంలోని క్లాక్‌టవర్ నుంచి మునిసిపల్ కార్యాలయం మీదుగా గడియారం చౌరస్తా వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగేవి. ఎట్టకేలకు బుధవారం రహదారి పనులను మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకతతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మునిసిపల్ పరిధిలోని 33వ వార్డులో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మునీరుద్దీన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డికి ఘన నివాళి


జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 4: దివంగత మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మాట్లాడుతూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా అందరినీ కలుపుకొని చివరి వరకు పనిచేశారన్నారు. నాయకులు సంజీవ్‌ముదిరాజ్, చంద్రకుమార్ గౌడ్, ఎన్‌పి వెంకటేశ్, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబ, మధుసూదన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అజ్మత్‌అలీ, రాములుయాదవ్, అవేజ్, లింగంనాయక్, అబ్దుల్‌హక్ పాల్గొన్నారు.

కేఎల్‌ఐ ప్రధాన కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

మిడ్జిల్, సెప్టెంబరు 4: కేఎల్‌ఐ అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన కాల్వ తరచు కోతకు గురవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రాములు అన్నారు. బుధవారం మున్ననూర్ గ్రామ శివారులోని కోతకు గురైన కేఎల్‌ఐ ప్రధాన కాల్వ, నీట మునిగిన పంటలు, ఇసుక మేటలు ఏర్పడిన పంటలను జిల్లా కార్యవర్గసభ్యులు కిల్లే గోపాల్, వ్యకాస జిల్లా కార్యదర్శి జగన్, రైతు జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పరిశీలించారు. కేఎల్‌ఐ ప్రధాన కాల్వ తెగిపోవడం వల్ల వాడియాల, మున్ననూర్ గ్రామాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ. 25వేల చొప్పున చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతులు రాజేష్‌కుమార్, నాగయ్య, రాఘవేందర్, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవాబ్‌పేట, సెప్టెంబరు 4: మండలంలోని చెన్నారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి సమక్షంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కారుకొండ కాంప్లెక్స్ హెచ్‌ఎం దశరథ్‌నాయక్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు మరికంటి రాములు, మాజీ సర్పంచ్ యాదయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, గోపాల్ గౌడ్, జైపాల్ యాదవ్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

భూత్పూర్, సెప్టెంబరు 4: పిల్లలు ఎదిగే వయస్సులో మంచి పౌష్టికాహారం ఇవ్వాలని సీహెచ్‌వో ఆయూబ్‌ఖాన్ అన్నారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి(బీ) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అజ్జరిసుల్తానా , అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసీంసుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

పాలమూరు, సెప్టెంబరు 4: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సంగెం సూర్యారావు, ఎం .శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని 11రోజుల నుంచి అమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహా సభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర పటేల్‌ను బుధవారం హైదరాబాద్‌లో వారు పరామర్శించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

మిడ్జిల్, సెప్టెంబరు 4: జిల్లాలోని వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు సీఎం ప్రకటించిన నష్టపరిహారాన్ని రైతులకు వెంటనే అందజేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్. రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, బీజేవైఎం యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిలతో కలిసి రాజేశ్వర్ విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటించి రైతులకు భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్‌గౌడ్, భీరయ్య, నరేష్‌నాయక్ తదితరులున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబరు 4: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటివిడుదల కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు. బుధవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 31.4 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు రెండు గేట్లను ఎత్తి 1400 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు.

శివశక్తినగర్ డ్రైనేజీని పరిశీలించిన మాజీ మంత్రి

మహబూబ్‌నగర్,సెప్టెంబరు4: పట్టణంలోని శివశక్తినగర్‌లో వరదనీటి కాలువ నిర్మాణ పనులు ఆగిపోవడం, ఇళ్ల మధ్య కాలువ తవ్వడంతో దోమలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు విన్నవించడంతో బుధవారం ఆయన కాలువను పరిశీలించారు. ఇళ్ల మధ్య కాల్వ పనులు ఆగిపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతోందని, అధికారులు వెంటనే స్పందించి పనులు చేపట్టాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జడ్చర్ల/ మహబూబ్‌నగర్‌విద్యావిభాగం, సెప్టెంబరు 4 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అప్రమత్తంగా ఉంటే మోసపోమని జడ్చర్ల ఎస్సై శివానందం సూచించారు. జడ్చర్ల పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో బుధవారం జడ్చర్ల పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాణి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రైవేట్ పాఠశాలల పీఈటీల జిల్లా సంఘం ఎన్నిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేటు పీఈటీల సమావేశం బుధవారం మెట్టుగడ్డ లిటిల్‌స్కాలర్ స్కూల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోహెల్ ఉర్ రహెమాన్, వినోద్‌కుమార్, కోశాధికారిగా విజయ్‌ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిభ గల క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదబాయి, మాజీ సెక్రటరీ రమేష్‌బాబు, జీయావుద్దీన్, అరుణ్, ప్రశాంత్, నర్సిములు, అహ్మద్‌హుస్సేన్, సురేష్, రియాజ్, ప్రణయ్, ముజీబ్, పరశురామ్, పాల్గొన్నారు,

ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- కేజీవీబీలో పనుల నిర్లక్ష్యంపై ఆగ్రహం


ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మిడ్జిల్, సెప్టెంబరు 4: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగుల సంఖ్యతో పాటు ప్రసవం, డెంగీ, జ్వరం కేసుల గురించి డాక్టర్ శివకాంత్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి మరమ్మతుల నిమిత్తం నిధులను మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో వర్షం వస్తే నీరు లోపలకు వస్తుందని డాక్టర్ శివకాంత్ కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. కుక్కకాటు కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని తెలుపగా వ్యాక్సిన్ అందుబాటులో ఉంది కదా అని వైద్యులను ప్రశ్నించారు. అక్కడే ఉన్న రోగులతో వైద్య సేవల గురించి ఆరా తీసి మాట్లాడారు. కేజీవీబీలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పనులను ఎందుకు పూర్తి చేయించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లడం లేదని తెలుపగా, సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచే పీఆర్‌ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని, కేజీవీబీలోని మిగిలిన స్థలంలో మొర్రం పోసి విద్యార్థులకు క్రీడా మైదానానికి ఉపయోగపడేలా చూడాలన్నారు. గడ్డిని తొలగించాలని, రాత్రివేళలో చుట్టు విద్యుత్ దీపాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతాంజలిని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ ఎప్పుడు వస్తుందని, దీంతో కేజీవీబీలోని అవరణమంత నీటితో నిండి పోతుందని, పైపును తొలగించాలని ఎన్ని సార్లు సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకరాగా అక్కడినుండే మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతాంజలి, డాక్టర్లు శివకాంత్, కృష్ణకుమార్, ఎంపీవో జగదీష్‌కుమార్, ఆర్‌ఐ అంబిక, నాయకులు అల్వాల్‌రెడ్డి, రాజేశ్వర్, సాయిలు గౌస్, రవీంద్‌గౌడ్, తిరుపతి, లాలు, నరేష్‌నాయక్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

మున్ననూర్ గ్రామ శివారులోని కేఎల్‌ఐ ప్రధాన కాల్వ పనులను నాసిరకంగా చేపట్టడంతో వర్షానికి కోతకు గురైందని, పొలాల్లో ఇసుక మేటలు వేసిందని సీపీఎం నాయకులు కలెక్టర్ విజయేందిర బోయి దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో కలెక్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రాములు, జిల్లా కార్యవర్గసభ్యుడు కిల్లే గోపాల్, వ్యకాస జిల్లా కార్యదర్శి జగన్, రైతు జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, రైతులు రాజేష్‌కుమార్, నాగయ్య, రాఘవేందర్, మురళి, పకీర్‌గౌడ్, చెన్నయ్య, జహీర్ కలిసి వినతి పత్రం అందజేశారు. తెగిన కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టి, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

జడ్చర్ల : జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ విజయేందిరబోయి తనిఖీ చేశారు. బుధవారం జడ్చర్ల తహసీల్‌కు వచ్చారు. వర్షం కారణంగా మండలంలో దెబ్బతిన్న ఇళ్లు, తెగిన చెరువులు, కుంటలు తదితర వాటిని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ధరణిలో పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మండలంలోని యాశాయికుంట తెగిందని, మరమ్మతులు చేపట్టామని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నయాబ్ తహసీల్దార్లు , పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి: వీసీలో కలెక్టర్

మహబూబ్ నగర్ (కలెక్టరేట్) : వర్షాలు తగ్గినప్పటికీ రానున్న రోజులు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బుధవారం ఆమె కలెక్టరేట్ నుంచి భారీ వర్షాలు, నష్టం, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల సమయంలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది బాగా పనిచేసి ప్రాణ, ఆస్తినష్టం పెరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంపై కలెక్టర్ అభినందించారు. గ్రామ స్థాయి మొదలు కొని జిల్లా కేంద్రం వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో చెరువుల, కుంటలు, ఎఫ్‌టీఎల్ ఎంత ఉంది, ఏమైన నిర్మాణాలు ఉన్నాయా అన్న విషయాలపై సమాచారాన్ని సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, మిషన్ భగీరథ, జడ్పీసీఈవో, డీపీవో తదితరులు వారి శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు. వీసీలో మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడం ముమ్మాటికి తప్పు



సమావేశంలో పాల్గొన్న పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు

పాలమూరు, సెప్టెంబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సర్వేనెంబరు 523లో కూల్చిన 78 ఇళ్లను తక్షణమే పునర్నిర్మించి ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు, టీఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పెట్టుబడిదారులు అక్రమించుకున్నది, పేదలు జీవించేందుకు నిర్మాణం చేసుకున్నవాటిని ఒకే గాటిన కట్టరాదన్నారు. 82ఎకరాలు కలిగిన సర్వేనెంబర్ 523లో పేదల ఇళ్లను కూల్చకుండా అక్కడ నిర్మాణానికి కారణమైన అధికారులు, ప్రజాప్రతినిధులను చట్టం ప్రకారం శిక్షించాలన్నారు. ఉండటానికి ఆధారమైన ఇంటిని కూల్చిస్తే పేదలు ఎక్కడ నివసించాలో పాలకులే చెప్పాలన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే ప్రజలు క్షమించరన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా బీఆర్‌ఎస్ అన్యాయం చేసింది, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. పీఆర్‌ఎల్‌ఐని రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని నారాయణపేట-కొడంగల్‌తో పూర్తి చేయాలన్నారు. 110టీఎంసీల నీరు కృష్ణానదిలో పారితే ఆ నీటిని ఒడిసి పట్టుకోలేక సముద్రం పాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ నీటిని తెలంగాణలో నిల్వ చేసుకునే సామర్థ్యం లేదని, ఆంధ్రలో మనకంటే అధికంగా నీటిని నిల్వ చేసుకునే సౌకర్యం ఇప్పటికే ఉందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన వాటినే మరోపేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా ప్రజల మేలు కోసం ఏమిచేస్తారో చెప్పాలన్నారు. వరద బాధితులు పూర్వ స్థితికి వచ్చేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవాచారి, కో-కన్వీనర్లు ఎ.తిమ్మప్ప, కేసీ వెంకటేశ్వర్లు, వామన్‌కుమార్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, జిల్లా అధ్యక్షుడు పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్తి కాని వంతెన మరమ్మతులు

- తాత్కాలిక రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాలు
- నాలుగు రోజులుగా బస్సులు, లారీల రాకపోకలు బంద్


ఇబ్రహీంబాద్ వద్ద కొనసాగుతున్న మరమ్మతు పనులు

హన్వాడ, సెప్టెంబరు 4: భారీ వర్షాల కారణంగా తెగిన రోడ్డును మూడు రోజుల్లో మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశించినా నేటికీ పనులు పూర్తి కాలేదు. చించోలి- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి పనులు జరుగుతున్నాయి. నాలుగురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంబాద్ గ్రామ సమీపంలో రెండు బ్రిడ్జిలను నిర్మిస్తున్న ప్రాంతంలో తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి మూడురోజుల్లో పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. అయినా నేటికీ పనులు పూర్తి కాలేదు. ఒక బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతో ద్విచక్ర వాహనలు, కార్లు, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడం లేదు. తెగిన రెండో బ్రిడ్జి వద్ద పనులు జరుగుతున్నాయి. అది తాత్కాలికంగా అందుబాటులోకి రావడానికి ఒకటి, రెండు రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. పనులను తహసీల్దార్, ఎంపీడీవోలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ప్రతీ మొక్క ఒక ఔషధమే

- జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య
- ఔషధ మొక్కల ప్రాధాన్యం, తయారీ అంశంపై సెమినార్


గార్డెన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ప్రొఫెసర్, అధ్యాపకులు

జడ్చర్ల, సెప్టెంబరు 4 : ప్రతి మొక్క ఒక ఔషధమే అని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుకన్య అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హల్‌లో బుధవారం నిర్వహించిన ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ఔషధ తయారీ అంశంపై వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల గురించి విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడానికి కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ ప్రత్యేకమైనదన్నారు. గార్డెన్‌లో 350 ఔషధ మొక్కలను సంరక్షించడం అందుకు నిదర్శనమన్నారు. పాలమూరు యూనివర్సిటీ వచ్చిన ప్రధానవక్తలు శివకుమార్ సింగ్, డాక్టర్ బృందాదేవి మాట్లాడుతూ పూర్వీకుల కాలం నుంచే వేదాలలో ఉన్నటువంటి ఔషధ విజ్ఞానం ఉందన్నారు. బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్న ఎన్నో ఔషధ మొక్కల యొక్క ఉపయోగాలను బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య వివరించారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి నీళ్లు పోసారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నర్మద, అధ్యాపకులు లత, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 38 మంది ఎంపిక

- నేడు ఎమ్మెల్యేల నుంచి అవార్డుల ప్రదానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అవార్డులు ఇవ్వనున్నారు. మొత్తంగా 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, డీఈవో రవీందర్ అవార్డులను అందజేయనున్నారు. ప్రతీమండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని సూచించిన కొన్ని మండల నుంచి ఎంపిక చేయలేదు. కొందరు ఉపాధ్యాయులు అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎంపికైన ఉపాధ్యాయులు వీరే :

1 .వి.సుధాకర్, జీహెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్ అయ్యవారిపల్లి, మిడ్జిల్ 2. వాణిమాలిణి దేవి, జీహెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్ కర్వెనా, భూత్పూర్ 3. ఎం. మల్లిక, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, పీఎస్ కోయిల్‌సాగర్, దేవకరద్ర 4. డి.రుక్మిణి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, పీఎస్‌మునిమోక్షం, హన్వాడ 5. నాగేంద్రప్రసాద్ , ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, పీఎస్‌జానంపేట , మూసాపేట 6. వి. స్వప్న ఎస్‌ఎ ఆంగ్లం, ప్రభుత్వ ఉన్నతపాఠశాల బీపీహెచ్‌ఎస్ మహబూబ్‌నగర్ 7. సహేదాబేగం ఎస్‌ఎ ఆంగ్లం, ప్రభుత్వ కోనపాలమూర్ ఉన్నత పాఠశాల మహబూబ్‌నగర్ 8. నిక్హత్ జాహన్ ఎస్‌ఎ ఆంగ్లం, జడ్పీహెచ్‌ఎస్ వస్పుల. మిడ్జిల్ 9 . రజని ఎస్‌ఎ ఆంగ్లం, జడ్పీహెచ్‌ఎస్ కారుకొండ, నవాబ్‌పేట 10. బి. సత్యనారాయణ రెడ్డి ఎస్‌ఎ గణితం, జడ్పీహెచ్‌ఎస్ నుసురుల్లాబాద్ , జడ్చర్ల 11. జి.సునీత, ఎస్‌ఎ గణితం జడ్పీహెచ్‌ఎస్ వస్పుల , మిడ్జిల్ 12. వి. జనార్దన్, ఎస్‌ఎ ఫిజిక్స్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర గండీడ్ , 13. క్రిస్టియానా, ఎస్‌ఎ ఫిజిక్స్ జడ్పీహెచ్‌ఎస్ ధర్మపూర్, మహబూబ్‌నగర్ రూరల్, 14. వెంకటేశ్, ఎస్‌ఎ జీవశాస్త్రం, జడ్పీహెచ్‌ఎస్ ఉడిత్యాల, బాలానగర్ 15. ఎక్బాల్ సుల్తానా, ఎస్‌ఎ సోషల్, జడ్పీహెచ్‌ఎస్ వేపూర్, హన్వాడ 16. సి. విష్ణువర్ధన్‌గౌడ్, ఎస్‌ఎ సోషల్, జడ్పీహెచ్‌ఎస్ యూపీఎస్ కన్నేపల్లి, రాజాపూర్ 17. జగన్‌మోహన్‌గౌడ్ పీడీ , జడ్పీహెచ్‌ఎస్ గొండ్యాల్, హన్వాడ 18. కవితాదేవి, ఎస్‌జీటీ మణికొండ, మహబూబ్‌నగర్ రూరల్ 19 . శైలజ ఎస్‌జీటీ పీఎస్ అప్పాయిపల్లి, మహబూబ్‌నగర్ , 20 . విజయలక్ష్మి, యూపీఎస్ అడ్డాకుల తండా అడ్డాకుల 21 . రామాదేవి ఎస్‌జీటీ పీఎస్ వడ్డేపల్లి అడ్డాకుల, 22. శ్వేత, ఎస్‌జీటీ పీఎస్ గుడిబండా తండా బాలానగర్ 23. టి.ప్రఫుల్లా చంద్ర, పీఎస్‌నేరేళ్లపల్లి బాలానగర్ 24 . రజింత్‌కుమార్ ఎస్‌జీటీ పీస్ దమగ్నాపూర్, చిన్నచింతకుంట 25. వెంకట్‌రావు ఎస్‌జీటి పీఎస్ పల్లమర్రి, చిన్నచింతకుంట 26. శ్రీనివాస్, ఎస్‌జీటీ పీఎస్ పర్దిపూర్ చిన్నచింతకుంట 27. సోమేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీటీ పీఎస్ నర్లోనికుంట, దేవరకద్ర 28. శ్రీనివాసులు, ఎస్‌జీటీ పీఎస్ బస్వాయిపల్లి, దేవరకద్ర 29. జయప్రదదేవి పీఎస్ హన్వాడ, 30. పురంధర్‌రెడ్డి పీఎస్ పుట్టపల్లి కొౌకుంట్ల, 31 . కవిత ఎస్‌జీటి పీఎస్ మూసాపేట 32. శ్రీనివాసులు ఎస్‌జీటీ, పీఎస్ కార్కర్లపహడ్ , నవాబ్‌పేట 33. రాంచంద్రయ్య ఎంపీపీఎస్ కొల్లూరు, నవాబ్‌పేట 34. అంజలీ చౌహన్ ఎస్‌జీటీ పీఎస్ పులినేపల్లి రాజాపూర్ 35. శంకరమ్మ, ఎస్‌వో కేజీబీవీ మహబూబ్‌నగర్ అర్బన్ 36 . జి.సుమతి పీజీసీఆర్‌టీ కేజీబీవీ నవాబ్‌పేట 37. మంజుల, సీఆర్‌టీ కేజీబీవీ కోయిలకొండ 38. అర్చన సింగ్, పీఈటీ కేజీబీవీ నవాబ్‌పేట

జిరాక్స్ షాపుల యజమానుల నుంచి కొటేషన్స్ ఆహ్వానం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ఏ4 సైజ్ పేపర్ నందు (రెండు దిక్కులు) ప్రింటింగ్ అండ్ జిరాక్స్ తీసేందుకు అనుభవం కలిగిన, అర్హులైన జిరాక్స్ షాపుల యజమానుల నుంచి సీల్డ్ కవర్ ప్రైజ్ కొటేషన్స్ కోరుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, విజయేందిర బోయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 5, 6తేదీల్లో, 9వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, మహబూబ్‌నగర్ కొటేషన్స్ దాఖలు చేయాలని సూచించారు. ఈ నెల 10న ఉదయం 11గంటలకు రెవెన్యూ అదనపు కలెక్టర్ చాంబర్‌లో సీల్డ్ కవర్ ప్రైజ్ కొటేషన్లను ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. అదనపు సమాచారం కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీలో చేరేందుకు నేరుగా అడ్మిషన్లు

జడ్చర్ల, సెప్టెంబరు 4 : జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలోని గిరిజన బాలుర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో నేరుగా అడ్మిషన్ పొందేందుకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ మంజుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో విద్యార్థులు కళాశాలకు రావాలని సూచించారు. అలాగే ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సులో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్లు

జడ్చర్ల, సెప్టెంబరు 4: జడ్చర్ల మండలం పోచమ్మగడ్డ తండా సమీపంలోని బాలానగర్ తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్‌లు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 17 సీట్లు, బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ మెమో, టీసీ, బోనఫైడ్, ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు ఒరిజినల్స్‌తో ఈ నెల 6లోగా సంప్రదించాలని సూచించారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

నవాబ్‌పేట,సెప్టెంబరు 4: గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో జయరాములు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. ముఖ్యంగా శానిటేషన్‌పై అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల కార్యదర్శులు ఉదయం నుంచి గ్రామాల్లో ఉండాలని సూచించారు. సమావేశంలో గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 4 : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సొసైటీల కింద గురుకులాల్లో పని చేస్తున్న ఆరువేల మంది పార్ట్‌టైం టీచర్లను తొలగించడం సరికాదని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం పార్ట్‌టైం టీచర్లను, కాంట్రాక్టు టీచర్లుగా పదోన్నతి కల్పిస్తామని చెప్పి విధుల నుంచి తొలగించడం శోచనీయమన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా తొలగించడం సరికాదన్నారు. విద్యార్థులు కూడా తీవ్రంగా నష్టపోతారని గుర్తుచేశారు. తొలగించిన టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

శ్రమదానంతో కల్వర్టు నిర్మాణం

జడ్చర్ల, సెప్టెంబరు 4 : జడ్చర్ల మునిసిపాలిటీలోని సరస్వతినగర్ కాలనీలో స్థానికులు చందాలు వేసుకుని, శ్రమదానం చేసి కల్వర్టును నిర్మించుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీలోకి వెళ్లే దారి వరద నీటితో కొట్టుకు పోయింది. వరద నీళ్లు పోయేవిధంగా కల్వర్టు నిర్మాణం చేసుకోవడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా కాలనీ వాసులంతా ఒక్కటై చేపట్టిన పనులు ఆదర్శంగా నిలిచాయి. శ్రమదానంలో కాలనీవాసులు వాసుచారి, పవన్‌చారి, శివశంకర్, రామకృష్ణ, మహేశ్వర్‌రెడ్డి, శివ, డేవిడ్, జైపాల్‌రెడ్డి, సత్యం, రాంకిషోర్, గోపాల్, రాము, సాయి, మనోహర్, నరేశ్, రహ్మన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పూజా సామగ్రి పంపిణీ

మూసాపేట, సెప్టంబరు 4: మండలకేంద్రంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో హనుమాన్, శివాలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాలకు బుధవారం నేను సైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సామాజిక సేవా కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ 33 రకాల పూజా సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన దేవాలయాల్లో దూపదీప నైవేద్యాల కోసం సామాన్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ నెల 7న వినాయక మండపాలకు కావాల్సిన వస్తువులను కూడా ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం మహేందర్, జి.ఆంజనేయులు, కృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాజు, రవి, సతీష్ తదితరులున్నారు.

'బాధిత కుంటుబాన్ని ఆదుకుంటాం'

మూసాపేట, సెప్టంబర్ 4 భారీ వర్షం ప్రభావం, విద్యుదాఘాతానికి గురై ఇల్లు కాలిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సూర్తితండాలో రెండు రోజుల కిందట కాలిపోయిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, ఎంపీటీసీమాజీ సభ్యుడు కృష్ణయ్య, నాయకులు లక్ష్మీనారాయణ ఉన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మిడ్జిల్, సెప్టెంబరు 4: సమాజంలో అన్ని పండుగలను ప్రతీ ఒక్కరు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు అన్నారు. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

- ప్రతీ వార్డులో రూ.4లక్షలతో అభివృద్ధి పనులు
- మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

జడ్చర్ల, సెప్టెంబరు 4 : పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ఫాగింగ్ చేపట్టాలంటూ మునిసిపల్ పాలకవర్గం సభ్యులు తీర్మానం చేశారు. జడ్చర్ల మునిసిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ పాలాది సారిక అధ్యక్షతన, కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్ల మునిసిపాలిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 27వార్డులకు ఒక్కో వార్డులో రూ.4లక్షలను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. కాలనీల్లో కుక్కల బెడద అధికం కావడంతో నివారణ చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.